క్లుప్తంగా

'జిల్లాస్థాయి సమావేశం విజయవంతం చేయండి'

తిర్యాణి: ఈనెల 24న జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఆదివాసీ పర్ధాన్ పురోహిత్ సంఘం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ 24న నిర్వహించే సమావేశంలో సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. పర్ధాన్ పురోహిత్ ఉద్యోగులు, మహిళలు, యువకులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు పెందూర్ ధర్ము, గెడం సుభాశ్, నైతం రాంచందర్, దుర్వా రవి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కేజీబీవీ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో రమేశ్‌బాబు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని కేజీబీవీని ఎంఈవో రమేశ్‌బాబు మంగళవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. న్యాస్ పరీక్ష నేపథ్యంలో విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన వెంట సీఆర్‌పీ శ్రీనివాస్ ఉన్నారు.

గోవులను తరలిస్తున్న వారిపై కేసు నమోదు

దహెగాం: మండలంలోని కల్వాడ గ్రామం వద్ద అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనం పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కందూరి రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా గోవులను తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు సోమవారం రాత్రి వాహనాన్ని పట్టుకున్నామన్నారు. గోవులు తరలిస్తున్న వలీ హైదర్, భీమేశ్‌లపై కేసు నమోదు చేసి, గోవులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించామని పేర్కొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని కౌటాల ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. మంగళవారం కౌటాల ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కౌటాల: ఆగ్రో రైతు సేవ కేంద్రం నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డిని కలిసి జిల్లా ఆగ్రో రైతు సేవ కేంద్రాల నిర్వాహకులు కోరారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆగ్రో రైతు సేవ కేంద్రాల ద్వారా రైతులకు సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వం ఆగ్రో రైతు సేవ కేంద్రాలకు సబ్సిడీపై పరికరాలు అందించి, కేంద్రాల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ఆగ్రో సేవ కేంద్రం జిల్లా అధ్యక్షుడు బండ కార్తీకర్, ప్రధాన కార్యదర్శి పాల్కె నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

అడవిపంది దాడిలో రైతుకు గాయాలు

పెంచికల్‌పేట్: మండలంలోని లోడుపల్లి గ్రామానికి చెందిన లావుడే శివరాం అనే రైతు అడవి పంది దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం గ్రామసమీపంలోని పంట చేనులోకి పత్తి ఏరడానికి కూలీలతో వెళ్లాడు. పత్తి తీస్తున్న క్రమంలో పంట చేనులో ఉన్న అడవి పంది ఒక్కసారిగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కూలీలు పెద్దగా కేకలు వేయడంతో అడవిపంది పారిపోయింది. తీవ్రంగా గాయపడిన రైతుకు స్థానికంగా చికిత్స అందించారు. సంఘటన స్థలాన్ని అటవీ అధికారులు పరిశీలించారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

వాంకిడి: బాలల హక్కులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ డోంగ్రి ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని ఇందాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల సంరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

గ్రామపంచాయతీల్లో సమస్యలు లేకుండా చూడాలి

బెజ్జూర్: గ్రామపంచాయతీల్లో సమస్యలు లేకుండా చూడాలని ఎంపీడీవో గౌరి శంకర్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

వైభవంగా మహాపాదయాత్ర

శ్రీసిద్ధి టోంకిని హనుమాన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 23వ మహా పాదయాత్రకు భారీగా భక్తజనం హాజరయ్యారు. వేకువజాము నుంచే కాగజ్‌నగర్ పట్టణం నుంచి సిర్పూర్(టి) మండల కేంద్రం మీదుగా కాలినడకన టోంకిని గ్రామంలోని హనుమాన్ ఆలయానికి భక్తులు చేరుకున్నారు. ఆసిఫాబాద్, బెల్లంపల్లి, మంచిర్యాలతోపాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్(టి) వరకు ప్రధాన రహదారి వెంబడి భక్తులకు పలు సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో పాలు, పండ్లు, అల్పాహారం, తాగునీరు అందించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ ముత్యం రమేశ్, ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఆలయంలో సిర్పూర్(టి) జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ అజయ్ ఉల్లం, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌లు పూజలు చేశారు.

– సిర్పూర్(టి)



దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



దర్శనం చేసుకుంటున్న భక్తులు



ఆలయ ప్రాంగణంలో భజన చేస్తున్న భక్తులు

ఏకలవ్య ఫౌండేషన్ సేవలు మరువలేనివి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

లింగాపూర్: ఆదివాసీ కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న ఏకలవ్య ఫౌండేషన్ సేవలు మరువలేనివని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. సిర్పూర్(యూ) మండలంలోని పెద్దదోబ గ్రామంలో మంగళవారం ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాబ్జిపేట సుస్థిర జీవనోపాధి పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీ ఉదయ్‌భాస్కర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డప్పుచప్పుళ్లతో ఆదివాసీ సంస్కృతిక నాట్యంతో స్వాగతించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏకలవ్య ఫౌండేషన్ ద్వారా 500లకు పైగా ఆదివాసీ గ్రామాలు లబ్ధి పొందాయన్నారు. వేలాది కుటుంబాలకు జీవనోపాధి దొరికిందని ఫౌండేషన్ సేవలను ప్రశంసించారు. ఫౌండేషన్ చైర్మన్ వెంకట్‌రావు, సోనేరావు, భీంరావ్, రాంరెడ్డి, అబ్దుల్, విజయ్‌కుమార్, నాగోరావు తదితరులు పాల్గొన్నారు.



డప్పుచప్పుళ్లతో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న ఆదివాసీలు

వరి పంట పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

రెబ్బెన: మండలంలోని కొమురవెల్లిలో విత్తన లోపంతో దెబ్బతిన్న వరి పంటను మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. గ్రామానికి చెందిన పెద్దింటి తిరుపతి అనే రైతు ఒక కంపెనీకి చెందిన జైశ్రీరాం వరి విత్తనాలను అచ్చులాపూర్‌లో గల ఓ ప్రైవేటు షాపులో కొనుగోలు చేసి సాగు చేశాడు. నాట్లు వేసిన రెండు నెలలకే విత్తనాల లోపంతో పంట పొట్టదశకు చేరుకుంది. దాంతో బాధిత రైతు విత్తన కంపెనీకి ఫిర్యాదు చేయగా పట్టించుకోకపోవటంతో జిల్లా వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేశాడు. దాంతో క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించిన స్థానిక వ్యవసాయాధికారులు వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలకు నివేదికలు అందించటంతో మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజుతో పాటు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త మధూకర్‌లు కొమురవెల్లికి వచ్చి దెబ్బతిన్న పంటను పరిశీలించారు. పంటకు సంబంధించిన పలు వివరాలను బాధిత రైతును అడిగి తెలుసుకున్నారు. పంట పరిశీలనకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి దిలీప్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు సంజీవ్, రాకేష్‌లు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

ఆశ్రమాల్లో కార్తిక శోభ..!

ఆసిఫాబాద్‌రూరల్: కార్తికమాసం అంటేనే పూజలు, శుభకార్యాలు, వ్రతాలకు ప్రత్యేకం. కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేస్తే పుణ్యఫలం వస్తుందని భక్తులు విశ్వసిస్తుంటారు. వీటితో పాటు నదీస్నానాలు, ఆలయ దర్శనాలు చేస్తుంటారు. ఆధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకుంటే మానసిక శాంతి కలుగుతుందని భక్తుల నమ్మకం. మండలంలోని బూర్గుడ, మోతుగూడ, బెల్గాం, రహపల్లి, దస్నాపూర్ వేదాంత విచారణ ధ్యాన ఆశ్రమాలు నేటి నుంచి మూడు రోజుల పాటు కార్తిక పౌర్ణమి వార్షికోత్సవం సందర్భంగా ముస్తాబయ్యాయి.

మూడు రోజుల పాటు..

మండలంలోని మోతుగూడ వేదాంత విచారణ ధ్యాన, బూర్గుడలోని బ్రహ్మనంద, బెల్గాంలోని కొవల్య ఆశ్రమాలలో కార్తిక పౌర్ణమి వార్షికోత్సవాలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. మొదటి రోజు ఉదయం సుప్రభాతసేవ, సామూహిక భగవద్గీత పారాయణం, ప్రణవ పతాకావిష్కరణ, నగర సంకీర్తన, గోమత, గురుదేవ పూజ, జ్యోతి ప్రజ్వలనతో పాటు రెండో రోజు ఆధ్యాత్మిక ప్రవచనాలు, మూడో రోజు ఉదయం సుప్రభాత సేవతో హోమం, గీత యజ్ఞం కార్యక్రమం, మధ్యాహ్నం ఆధ్యాత్మిక మహాసభ, ఉపన్యాలు అనంతరం తీర్థ ప్రసాదాలు అన్నదాన కార్యక్రమాలు కొనసాగనున్నాయి.



మోతుగూడ ఆశ్రమంలో పూజలు చేస్తున్న భక్తులు

పెద్దవాగు తీరాన కార్తిక సందడి

దహెగాం: కార్తీక మాసం పురస్కరించుకుని పాత దహెగాం సమీపంలోని పెద్దవాగు తీరాన కార్తిక సందడి నెలకొంది. మంగళవారం ఉదయం భక్తులు పెద్దవాగుకు వెళ్లి స్నానాలు ఆచరించి అక్కడే సైకత లింగం తయారు చేసి వేద పండితుడు పరమేశ్వర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా మహిళలు దీపాలను వాగులో వదిలారు. అనంతరం అక్కడే ఉన్న శివాలయం, అభయాంజనేయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



దహెగాంలో పూజలు నిర్వహిస్తున్న వేదపండితుడు

'కలెక్టర్‌పై దాడి చేయడం దారుణం'

తిర్యాణి: వికారాబాద్ జిల్లాలో విధుల్లో ఉన్న కలెక్టర్‌తో రెవెన్యూ సిబ్బందిపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడటం అమానుషమని తహసీల్దార్ సూర్యప్రకాశ్ అన్నారు. దాడిని నిరసిస్తూ రెవెన్యూ సిబ్బంది మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. డిప్యూటీ తహసీల్దార్ వంశీకృష్ణ, ఆర్‌ఐ రాజేశ్, జూనియర్ అసిస్టెంట్ సాయి, కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్, భానేశ్, గణేశ్, సంపత్ తదితరులు ఉన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: వికారాబాద్ జిల్లా కలెక్టర్, కార్యాలయ సిబ్బందిపై సోమవారం జరిగిన దాడికి నిరసనగా మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్, మండల పరిషత్(ఎంపీడీవో) కార్యాలయ సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. తహసీల్దార్ దత్తు ప్రసాద్, డీటీ సంతోష్ కుమార్, ఎంపీడీవో అంజద్‌పాషా, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, తదితరులు ఉన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై దాడి హేయమైన చర్య అని ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది మంగళవారం నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించి కార్యాలయం ఎదుట నిరసనలు తెలుపారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీవో ఖాజా అజీజుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.



తిర్యాణి: నిరసన తెలుపుతున్న సిబ్బంది

దహెగాంలో..

దహెగాం: వికారాబాద్ జిల్లాలో అధికారులపై దాడి చేసినందుకు గాను ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పలువురు మాట్లాడుతూ అధికారులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారులకు భద్రత లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం


ఆసిఫాబాద్: జిల్లా న్యాయసేవాధికార సంస్థలో వివిధ పోస్టుల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్టెనో/టైపిస్ట్ 01, టైపిస్ట్‌కమ్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్ 01 పోస్టులు భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 22 సాయంత్రం 5గంటల లోగా అభ్యర్థులు తమ దరఖాస్తులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా న్యాయస్థానం, కుమురం భీం ఆసిఫాబాద్‌కు తమ దరఖాస్తులు నేరుగా లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించాలన్నారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే పోస్ట్ వివరాలు కవర్‌పై తప్పనిసరిగా రాయాలని తెలిపారు. ఈ నెల 23 నుంచి 28 వరకు దరఖాస్తులు పరిశీలించి, డిసెంబర్ 2న హాల్ టికెట్లు జారీ చేయనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 7న ఉదయం 10.30 గంటలకు రికార్డ్ అసిస్టెంట్, మధ్యాహ్నం 3 గంటలకు స్టెనోటైపిస్ట్, టైపిస్ట్ కమ్ అసిస్టెంట్ పోస్టులకు రాత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

కస్తూరిబా విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియన్ స్కూళ్లలో..

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని కస్తూరిబా విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియన్ స్కూళ్లలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీల్లో 2, యూఆర్‌ఎస్ స్కూల్‌లో ఒక అకౌంటెంట్, కేజీబీవీల్లో ఐదు ఏఎన్‌ఎం పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేందుకు ఆసక్తి గల వారు ఈ నెల 20లోగా దరకాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు 18 నుంచి 45 ఏళ్లలోపు ఉండాలన్నారు. అకౌంటెంట్‌కు కామన్ డిగ్రీతోపాటు బేసిక్ కంప్యూటర్ స్కిల్స్ లేదా బీకాం కంప్యూటర్ సైన్స్ చేసి ఉండాలని పేర్కొన్నారు. ఏఎన్‌ఎం పోస్టుకు ఇంటర్‌తోపాటు ఏఎన్‌ఎం ట్రైనింగ్ సర్టిఫికెట్ ఉండాలని, వృత్తివిద్య కోర్సులో జీఎన్‌ఎం ట్రైనింగ్, బీఎస్సీ నర్సింగ్ సర్టిఫికెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. కేజీబీవీల్లో పోస్టులకు మహిళలు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు.

వార్షిక టార్గెట్ కమిటీ సభ్యుల పర్యటన

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో మంగళవారం వార్షిక టార్గెట్ కమిటీ సభ్యులు పర్యటించారు. గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్ని విభాగాల అధికారులతో వార్షిక కమిటీ సభ్యులు సమావేశమై వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఏరియాకు నిర్దేశించాలిస్సిన వార్షిక టార్గెట్‌పై చర్చించారు. కమిటీ సభ్యులు జీఎం (కార్పొరేట్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) ఎ.మనోహర్, జీఎం (ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) సాయిబాబు, మార్కెటింగ్ జీఎం రవిప్రసాద్, ఏజీఎం ఐఈ సీహెచ్ వెంకయ్య, డీజీఎం మార్కెటింగ్ సురేందర్‌రాజు, అడిషనల్ మేనేజర్ దిలీప్‌కుమార్‌లు 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏరియాకు నిర్దేశించాల్సిన ఉత్పత్తి, ఉత్పాదకత సాధన కోసం అవసరం అయ్యే యంత్రాలు, పరికరాల వివరాలను తెలుసుకున్నారు. ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీని సందర్శించి పని స్థలాలను పరిశీలించారు. వట్టివాగు రక్షణ కట్ట, ఉల్లిపిట్ట, డోర్లి గ్రామాలకు వెళ్లే మార్గంలో సింగరేణి నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీలించారు. ప్రాజెక్టు అధికారి నరేందర్, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, సర్వే అధికారి చంద్రశేఖర్, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న, మేనేజర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఖైరిగూడ ఓసీపీని పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

'డీఎంపై చర్యలు తీసుకోవాలి'

ఆసిఫాబాద్‌అర్బన్: ఆర్టీసీ కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్న డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం మాట్లాడారు. డీఎం తరచూ డ్రైవర్లు, కండక్టర్లపై దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అవినీతి ఆరోపణలను సైతం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నా పట్టించుకోవడం లేదన్నారు. డీఎం తన వైఖరి మార్చుకోకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

బెజ్జూర్: తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండలంలోని మర్తిడి గ్రామస్తులు కోరారు. మంగళవారం బెజ్జూర్ ఎంపీడీవో గౌరిశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. గత నెల రోజులుగా గ్రామంలో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎంపీడీవో సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

తప్పులు లేకుండా జాగ్రత్తలు పాటించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): ఓటరు జాబితాలో తప్పులు లేకుండా అధికారులు, సిబ్బంది జాగ్రత్తలు పాటించాలని ఉమ్మడి జిల్లా ఓటరు జాబితా పరిశీలకుడు సురేంద్ర మోహన్ అన్నారు. రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 324, 325 పోలింగ్ కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. ఓటరు నమోదు దరఖాస్తులను పరిశీలించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 28 వరకు కొత్త ఓటరు నమోదు చేసుకునే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని బీఎల్‌వోలకు సూచించారు. ఆయన వెంట ఆర్డీవో లోకేశ్వర్‌రావు, తహసీల్దార్ పి.రామ్మోహన్‌రావు, జిల్లా భూగర్భ, గనుల శాఖ అధికారి గంగాధర్ ఉన్నారు.



దరఖాస్తులు పరిశీలిస్తున్న సురేంద్రమోహన్

భక్తిశ్రద్ధలతో ప్రబోధిని ఏకాదశి

కెరమెరి: మండల కేంద్రంలో శివాయంలో మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రబోధిని ఏకాదశి జరుపుకున్నారు. ఉదయం మహిళలు తలంటు స్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరించి శివాలయానికి చేరుకున్నారు. శివునికి మంగళహారతులు ఇచ్చారు. నందికి పూజలు చేశారు. భజనలు పాడారు. రావిచెట్టుకు పూజలు చేసి ప్రదక్షిణలు చేశారు. ఆంజనేయ స్వామికి, సాయి దేవునికి పూజలు చేశారు.



రావి చెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

బాధ్యతలు స్వీకరించిన ఏవోలు

తిర్యాణి: మండల వ్యవసాయశాఖ అధికారి (ఏవో)గా కే. వినయ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి గ్రామానికి చెందిన వినయ్ మొదటి పోస్టింగ్‌లో తిర్యాణి ఏవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి పంటల సాగుపై ఉన్న సందేహాలను నివృత్తి చేస్తానన్నారు.

లింగాపూర్ నూతన ఏవోగా సంజయ్‌కుమార్

లింగాపూర్: మండలంలోని నూతన ఏవోగా బాధ్యతలు స్వీకరించిన సంజయ్‌కుమార్‌ను మంగళవారం గ్రామస్తులతో పాటు ఏఈవోలు రైతువేదికలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఈవో ఖలీల్, శ్రీనివాస్, గ్రామస్తులు మంగులాల్, అనిల్, జైపాల్, రాజేశ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



లింగాపూర్: సన్మానిస్తున్న ఏఈవోలు

'సమస్యలు పరిష్కరించకుంటే మరో పోరాటం'

ఆసిఫాబాద్‌అర్బన్: ఐకేపీ వీవోఏ సమస్యలు పరిష్కరించకుంటే మరో పోరాటానికి సిద్ధమవుతామని వీవోఏల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట వీవోఏల 48 గంటల దీక్ష ముగింపు సందర్భంగా మంగళవారం డీఆర్‌డీవో దత్తారావుకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ హామీ మేరకు రూ.20వేల వేతనం చెల్లిస్తూ ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుద్ధు, రోజా మాట్లాడుతూ అనారోగ్యం, ప్రమాదాలతో నిత్యం వీవోఏలు మరణిస్తున్నారని తెలిపారు. కనీస బీమా సౌకర్యం లేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివేణి, తెలంగాణ ఐకేపీ ఉద్యోగుల రాష్ట్ర కమిటీ సభ్యురాలు రమ, నాయకులు సంతోష్, రవీందర్, సతీశ్, శ్రీనివాస్, ధన్‌రాజ్, తిరుపతి, మహేశ్వరి, వనిత, ఆనంద్‌రావు, మధుకర్ పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సర్వేకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలి

రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ సమగ్ర కుల గణన సర్వేకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. మంగళవారం గోలేటిలో కొనసాగుతున్న కుల గణన సర్వేను వారు పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లాస్, నాయకులు ప్రకాశ్‌రావు, సాంబగౌడ్, దుర్గం రవీందర్, బాలునాయక్, పర్వతి సాయి, మహేశ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పులికుంటలో..

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా పూర్తి చేయాలని డీపీవో భిక్షపతి అన్నారు. మంగళవారం మండలంలోని పులికుంటలో ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఎన్యూమరేటర్లు నమోదు చేస్తున్న కుటుంబ సభ్యుల వివరాలను పరిశీలించారు.

కెరమెరి: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా మంగళవారం మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 954 కుటుంబాలకు సర్వే నిర్వహించారు. మండలంలో మొత్తం 10,034 కుటుంబాలు ఉన్నట్లు ఎన్యూమరేటర్లు గుర్తించారు. ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్, ఎంఈవో ఆడే ప్రకాశ్ పర్యవేక్షించారు.



కెరమెరి: సర్వేను పరిశీలిస్తున్న శ్యాంనాయక్

ప్రజలు ఇచ్చిన సమాచారాన్ని పూరించాలి..

ప్రజలు తెలిపిన సమాచారాన్ని మాత్రమే సమగ్ర కుటుంబసర్వే ప్రొఫార్మలో పూరించాలని కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని దేవాపూర్‌లో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.విజయ్‌కుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899